క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వర గానామృతం



సత్తెనపల్లి: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణ గడియార స్తంభం సమీపంలోని కట్టమూరివారివీధిలో గల కోదండ రామాలయంలో మంగళవారం వేంకటేశ్వర గానామృతం కార్యక్రమం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఉదయం 9 గంటల నుండి గానామృతం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. రాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడికి మహిళలు సామూహిక హారతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

రుణమేళాకు 101 మంది హాజరు

సత్తెనపల్లి: బీసీ, ఓసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సామాజిక వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు బ్యాంకుల ద్వారా స్వయం ఉపాధి రుణాలు అందించేందుకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాల్లో మంగళవారం నిర్వహించిన రుణమేళాకు 101 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. ఆన్‌లైన్ ద్వారా మొత్తం 288 మంది దరఖాస్తు చేయగా వారిలో 101 మంది మాత్రమే హాజరయ్యారు. 187 మంది గైర్హాజరయ్యారు. ఇన్‌చార్జ్ మున్సిపల్ మేనేజర్ షేక్ షంషేర్ మహబూబ్ సుభాని, టీఎంసీ షేక్ ఖాజా, సీ–1 చిన్నమ్మాయి, బ్యాంకు అధికారులు, లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

మాతా శిశు సంరక్షణలో ప్రముఖ పాత్ర వహించాలి



రాజుపాలెం: మాతా శిశు సంరక్షణలో ప్రతి ఒక్కరు ప్రముఖ పాత్ర వహించాలని, గర్భిణులకు ఏమైన ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని వైద్యాధికారులు డాక్టర్ రవితేజనాయక్, డాక్టర్ సౌల్ రవిలు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర రవితేజనాయక్ మాట్లాడుతూ ప్రతి కాన్పు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే జరగాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి తెలిపారు. వేసవి కాలంలో మంచి నీటి సమస్య వలన, తినే ఆహారం వలన వాంతులు, విరేచనాలు వస్తుంటాయని, అవి రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆశా నోడల్ అధికారి ఉషారాణి, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్ రావు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా అమ్మకందారుల అరెస్ట్



నకరికల్లు: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కె.సోమయ్య హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని చేజర్ల గ్రామంలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కేటగిరీలో ఉన్న చేజర్ల గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో భాగంగా నాటుసారా కలిగి ఉన్న ఇద్దరు మహిళలను గుర్తించారు. వారి వద్దనున్న నాలుగు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని ఇరువురిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నాటు సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ తారాలక్ష్మి, సిబ్బంది రమణకుమారి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి

సీపీఎం మండల కార్యదర్శి సూరిబాబు

అమరావతి: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజానీకంపై మోయలేని భారం మోపటం దారుణమని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలను ఆర్థికంగా ఇబ్బంది పెట్టే చర్యలను సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. పేద ప్రజలకు ఉపాధి లేక అర్ధాకలితో అలమటిస్తుంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు గ్యాస్ ధరలు పెంచడం అన్యాయమన్నారు. గ్యాస్ ధర రూ.50 పెంచటం ద్వారా కేంద్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో సామాన్య ప్రజలపై భారం మోపే ప్రయత్నం చేస్తుందన్నారు. పెట్రోలు, డీజిల్ సుంకం లీటర్‌కు రూ.2 పెంపు వలన వివిధ వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ప్రజలంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల్ని నిరసించాలన్నారు.

విజ్ఞానం అందేనా..?!

- సొంత భవనం ఉన్నా నిర్వహణ కరువు
- లైబ్రరీగా అభివృద్ధి చేసి ప్రారంభించాలని కోరుతున్న గ్రామస్తులు

మూతపడిన పుస్తక పఠన కేంద్రం



దొడ్లేరులోని పుస్తక పఠన కేంద్రం (మినీ లైబ్రరీ)

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామం 10 వేల జనాభా కలిగి, క్రోసూరు తరువాత రెండవ మేజరు పంచాయతీ, జెడ్పీ పాఠశాల, ఒక ప్రైవేటు పాఠశాల, ఎంపీయూపీ పాఠశాలలతో చుట్టు పక్కల సుమారు 5 గ్రామాల విద్యార్థులు చదువుల కొరకు వచ్చే గ్రామం. ఇక్కడ గ్రంథాలయానికి సొంత భవనం ఉన్నప్పటికీ ఇప్పటి వరకు సరియైన గ్రంథాలయం మాత్రం లేదని ప్రజలు అంటున్నారు. విజ్ఞానం అందించే గ్రంథాలయమే మూతబడితే విజ్ఞానం ఎలా అందుతుందని గ్రామస్తులు అడుగుతున్నారు. 2008లో గ్రామానికి చెందిన పొట్టి సైదులు స్థలం దానం చేయగా గ్రామ పెద్దల సహకారంతో అప్పటి మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పుస్తక పఠన కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే అది ప్రస్తుతం మూతబడింది. అయితే దానిని లైబ్రరీగా అప్‌గ్రేడ్ చేసి తిరిగి ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనారోగ్యం కారణంతో...

ప్రతి రోజు మూడు దినపత్రికలు, మండల గ్రంథాలయం నుంచి 50 పుస్తకాలు తీసుకొచ్చి ఇక్కడ గ్రంథాలయం నిర్వహణ జరిగేది. గ్రంథాలయాన్ని అనేక మంది విద్యార్థులు, నిరుద్యోగులు, పెద్దలు వినియోగించుకోవటం జరిగింది. దొడ్లేరులో పుస్తక పఠన కేంద్రాన్ని నిర్వహించే వ్యక్తికి జిల్లా శాఖ నుంచి ప్రతి నెలా మూడు దినపత్రికల కొరకు సుమారు రూ.500 ఇస్తారు. అదేవిధంగా క్రోసూరు గ్రంథాలయం నుంచి విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు తీసుకెళ్లి 15 రోజులకు ఒకసారి తిరిగి అప్పగించాలి. దీనికి గాను నిర్వాహకుడికి జిల్లా శాఖ నుంచి ప్రతి నెల రూ.3 వేలు జీతం ఇస్తారు. పాత పేపర్లు ఎప్పటికప్పుడు క్రోసూరు లైబ్రరీకి అప్పగించటం లేదా, అక్కడే స్థలం ఉంటే ఆక్షన్ ఆదేశాలు వచ్చే వరకు ఉంచటం జరుగుతుంది. కాగా గ్రంథాలయాన్ని నిర్వహించే వ్యక్తి అనారోగ్య కారణాలతో మానుకోవటంతో గత కొన్ని సంవత్సరాలుగా మూతపడింది. దీనిపై విద్యార్థులు, నిరుద్యోగులు, పెద్దలు గ్రంథాలయ సంస్థ అధికారులు తక్షణమే పట్టించుకుని తిరిగి ప్రారంభించాలని కోరుతున్నారు.

లైబ్రరీ అవసరం ఉంది



స్థలాలు దొరకని ప్రస్తుత పరిస్థితిలో లైబ్రరీ కొరకు 2008లో దాతలు స్థలం దానం చేశారు. దానిని కమ్యూనిటీ భవనం కింద నిధులు మంజూరు చేయించి లైబ్రరీ భవనం కట్టించి అప్పటి మంత్రి కన్నా లక్ష్మీనారాయణ చేత ప్రారంభింపచేశాం. లైబ్రరీని ప్రతి రోజు శుభ్రంగా ఊడ్చేందుకు, తాగునీళ్లు పెట్టేందుకు స్వీపర్, నిర్వాహకుడు తప్పనిసరిగా ఉండాలి. గ్రామంలో ఇంటి పన్నులలో లైబ్రరీ సెస్ కూడా వసూలు చేస్తారు. కానీ గ్రంథాలయం నిర్వహించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. గ్రంథాలయ అవసరం ఎంతైనా అవసరం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని దొడ్లేరులో గ్రంథాలయాన్ని ప్రారంభించాలి.

– సోము మస్తాన్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్, దొడ్లేరు

జిల్లా అధికారులు స్పందించ లేదు



అయితే గ్రంథాలయ నిర్వాహకుడు అనారోగ్య కారణాలతో ఐదు సంవత్సరాల క్రితమే మానుకోవటం జరిగింది. ఆ విషయాన్ని జిల్లా అధికారులకు అప్పటి గ్రంథాలయ అధికారి తెలియజేయటం జరిగింది. కానీ ఇప్పటి వరకు జిల్లా అధికారులు స్పందించ లేదు.

– వై.వీరాంజమ్మ, మండల గ్రంథాలయ అధికారి, క్రోసూరు

పుస్తకాలు కొనలేని వారికి అవసరం



పేద కుటుంబాల పిల్లలు పుస్తకాలు కొనలేరు. వారికి కావాల్సిన దిన పత్రికలు, పుస్తకాలు లైబ్రరీలో దొరుకుతాయి. కానీ దొడ్లేరు పెద్ద పంచాయతీ అయినప్పటికీ గ్రంథాలయం అప్‌డేట్ చేయకపోవటంతో ఉన్న పుస్తక పఠన కేంద్రం కూడా మూతపడింది. జిల్లా గ్రంథాలయ సంస్థ ఇప్పటికై నా దొడ్లేరులో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి.

– జెల్లి నరసింహారావు, మాలమహానాడు మండల అధ్యక్షుడు, దొడ్లేరు

నేను లైబ్రరీలో పేపర్లు చదువుతాను



నేను క్రోసూరు వెళ్లినపుడు తప్పనిసరిగా లైబ్రరీకి వెళ్లి పేపర్లు చదువుతుంటాను. కానీ దొడ్లేరులో గ్రంథాలయం ఎప్పుడు చూసినా మూసే ఉంటుంది. గ్రంథాలయం తెరవాలని కోరుతున్నాను.

– షేక్ షబ్బీర్, దొడ్లేరు

పండ్ల తోటలతో పాటు.. పూల తోటలు సాగు చేయండి

జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు



పెదకూరపాడు : పండ్ల తోటలతో పాటు రైతులు పూల తోటలనూ సాగు చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు కోరారు. పెదకూరపాడు మండలంలోని కాశిపాడు గ్రామంలో మంగళవారం బొప్పాయి పంటలను వాటిలో సాగు చేసే అంతర పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బొప్పాయి రైతు అడపాల రామాంజనేయులుతో మాట్లాడారు. బొప్పాయి సాగు విధానాలు, వాటిలో అంతర్గతంగా సాగు చేసే పంటలను గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. రైతులు ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపుతున్నారని, పండ్ల తోటలతో పాటు పూల తోటలను సాగు చేస్తే అధిక దిగుబడులతో పాటు లాభాలు పొందవచ్చునని రైతులకు సూచించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి సీహెచ్‌వీ రమణ రెడ్డి, ఆర్డీవో రమణా కాంత్ రెడ్డి, తహసీల్దార్ ధనలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి శ్రీనిత్య, సహాయకులు సాయి ప్రసన్న కుమార్, రాహుల్ పాల్గొన్నారు.

నేడు బీఎల్‌ఓలకు శిక్షణ

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల బూత్ లెవల్ అధికారులకు ఓటు నమోదు విషయంలో తీసుకోవాల్సిన విధానాలపై సత్తెనపల్లి మండలంలోని లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో 9న శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరవుతారని, అన్ని గ్రామాల బీఎల్‌ఓలు హాజరు కావాలన్నారు.

న్యాయవాదులు విధులు బహిష్కరణ



న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: న్యాయవాదులపై దాడులు నియంత్రించి, న్యాయవాద పరిరక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెండు ప్రాంతాల్లో ఇద్దరు న్యాయవాదులపై జరిగిన దాడిని ఖండిస్తూ సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గంగూరి అజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో గోదావరిఖని బార్ అసోసియేషన్‌లో న్యాయవాది అయిన నూతి సురేష్, మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు, హైదరాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్న ముజ్జబ అలీపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ రెండు చోట్ల జరిగిన దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాద పరిరక్షణ చట్టంను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చిన్నం మణి బాబు, న్యాయవాదులు సయ్యద్ అబ్దుల్ రహీమ్, కొల్లా వెంకటేశ్వరరావు, బొక్క సంగీతరావు, దివ్వెల శ్రీనివాసరావు, చలువాది చినసత్యనారాయణ, పూజల వెంకట కోటయ్య, బి.ఎల్.చిన్నయ్య, రాజవరపు నరసింహారావు, పూదోట రాజు, సందెపోగు బాబురావు, మేదర అనిల్ కుమార్, గుర్రం పవన్ కుమార్, మద్దినేని వెంకట చలపతిరావు, షేక్ నాగులా, తవ్వా హరనాథ్, ఉల్లం మధు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల పాలిట దేవుడు స్వర్గీయ నకారా



నకారా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు



పెన్షనర్ల పితామహుడు కే.శే.నకారాకు నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

సత్తెనపల్లి: పెన్షనర్ల పాలిట దేవుడు స్వర్గీయ ధరమ్ స్వరూప్ నకారా అని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం స్వర్గీయ నకారా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వర్గీయ నకారా పెన్షనర్ల పాలిట దేవుడిగా వర్ణించారు. డీఎస్ నకారా చేసిన కృషి, పోరాటం చిరస్మరణీయమన్నారు. ప్రధాన కార్యదర్శి కే.బి.ఆర్.జె ప్రసాద్ మాట్లాడుతూ రిటైర్ అయిన ఉద్యోగులకు పెన్షన్ కేటాయింపులో జరుగుతున్న అవకతవకలకు వ్యతిరేకంగా ఆయన సుప్రీం కోర్టులో కేసు వేసి విజయం సాధించారన్నారు. పోతులూరయ్య మాట్లాడుతూ నకారా ఇంగ్లీష్ లిటరేచర్‌లో బంగారు పతకం అందుకున్నారన్నారు. పెన్షనర్ల కోసం చేసిన న్యాయపోరాటం ఆయనకు విశేషమైన గుర్తింపు లభించుటకు కారణమైందన్నారు. మురహరిరావు మాట్లాడుతూ ఆనాడు అత్యధికంగా రూ.675 మాత్రమే పెన్షన్ ఉండేదని, ఆయన కృషి వలన నేడు సంతృప్తికరమైన పెన్షన్ పొందుతున్నామన్నారు. ముందుగా నకారా చిత్రపటానికి గౌరవ అధ్యక్షుడు బొడ్డు రామారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోశాధికారి రంగారెడ్డి, రామకోటయ్య, చంద్రయ్య, సైదులు, వెంకటాద్రి, రమాదేవి, జగన్నాధ నాయుడు, జయనుల్లా, ఖాదర్‌వలీ, మొహిద్దీన్, సూర్యనారాయణ, మల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, నాసరయ్య, కమలాకరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్ నకారాకు ఘన నివాళి

అమరావతి: పెన్షనర్ల పితామహుడు కీ.శే.డి.ఎస్. నకారా జయంతి కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక పెన్షనర్ల సంఘ కార్యాలయంలో నిర్వహించారు. అమరావతి–పెదకూరపాడు మండలాల యూనిట్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు నడకుదురు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నకారా చిత్రపటానికి పూల మాల వేసి పెన్షనర్లందరు ఘనంగా నివాళులర్పించారు. ఈ సంసదర్భంగా నడకుదురు నాగేశ్వరరావు మాట్లాడుతూ పది సంవత్సరాలపాటు డీఎస్ నకారా ప్రభుత్వాలపై పోరాటం చేసి పెన్షనర్లకు అనుకూలంగా సుప్రీంకోర్టులో చరిత్రాత్మకమైన తీర్పు వచ్చేటట్లు కృషి చేశాడన్నారు. నకారా ఆశయాలకనుగుణంగా పెన్షనర్లందరు నడచుకోవాలని, పెన్షన్ అనేది ఉద్యోగి సేవలకు ప్రతిఫలం మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ ప్రతినిధులు పి.వెంకటేశ్వరరావు, నంబూరి వెంకటేశ్వర్లు, కోనూరు అప్పారావు, ప్రఫుల్లారాణి, ఇందిరాదేవి, హనుమంతరావు, నాగేశ్వరరావు, రాయప్ప వలి, భాస్కరరెడ్డి, మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన కలెక్టర్



మాదల(ముప్పాళ్ళ): ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతంలో వసతులు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. మండలంలోని మాదల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పని ప్రాంతంలో నీడ, తాగునీరు, ఫస్ట్‌ఎయిడ్ కిట్ ఉండాలన్నారు. పనులను పరిశీలించి అక్కడే కూలీలతో మాట్లాడారు. వేతనాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వసతులపై ఆరా తీశారు. కూలీ ఎంత అందుతుంది, ఏ సమయం వరకు పని చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఉదయాన్నే వచ్చి ఎండ వచ్చే సయయానికి పని ముగించుకునేలా చూసుకోవాలని సూచించారు. సేద్యపు కుంటల నిర్మాణాల పైనా ఆరా తీశారు. ఆయనతో పాటు డ్వామా పీడీ సిద్దలింగమూర్తి, తహసీల్దార్ ఎం.భవానిశంకర్, ఏపీడీ వెంకటనారాయణ, ఏపీఓ ఏడుకొండలు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు

సీఐ విజయ్‌కుమార్



రాజుపాలెం: మద్యం ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేటుకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని రెడ్డిగూడెం, చౌటపాపాయపాలెం గ్రామాలలోని ప్రైవేటు మద్యం షాపులలో మంగళవారం సీఐ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సేల్స్‌మెన్‌కు పలు సూచనలను సీఐ చేశారు. ఎమ్మార్పీ ధరకు మద్యం అమ్మాలని, అకౌంట్ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, ఎమ్మార్పీ ధరల పట్టికలను బోర్డు ద్వారా బయట ప్రదర్శించాలని తెలిపారు. ఆయన వెంట ఎస్‌ఐ కె.నాగలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై క్షేత్ర స్థాయి విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సత్తెనపల్లి: మండలంలోని గుడిపూడి గ్రామంలో మంగళవారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై క్షేత్ర స్థాయి విచారణ చేపట్టారు. గ్రామంలోని దేవదాయ భూములపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించే ప్రజావేదికలో గ్రామానికి చెందిన గంధం శ్రీకాంత్ ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు గుడిపూడి గ్రామంలో ఫిర్యాదిదారును కలిసి అతను సమర్పించిన రికార్డులు, అధికారుల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. చట్ట ప్రకారం దేవదాయ భూముల విస్తీర్ణం నిర్ణయిస్తామని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో విచారణ చేపడతామని, నాణ్యమైన పరిష్కారాలు అందించని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

చేనేత సహకార సంఘాల బకాయిలు విడుదల చేయాలి

చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం



వినతిపత్రం అందిస్తున్న వీరబ్రహ్మం, కార్మికులు

సత్తెనపల్లి : చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.156 కోట్ల బకాయిలను తక్షణం విడుదల చేయాలని చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలోని వార్డు సచివాలయ సిబ్బందికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మం మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత కార్మికులకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవటం అన్యాయమన్నారు. దేశంలో వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి జీవనోపాధి కల్పిస్తున్న చేనేత పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. చేనేత పరిశ్రమకు బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని, నేతన్న నేస్తం పథకాన్ని ఇవ్వాలని, చేనేత సహకార సంఘాల అప్పులను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. చేనేత కార్మికులు పంతంగి ప్రభాకర్, జి సుశీసిలోన్, బిట్రా పానకాలరావు, ఉద్దటి దుర్గ, చిన్న దిబ్బయ్య, ఏసురత్నం, బాబురాజు, వంగర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

బెల్లంకొండ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై.హనుమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరుగుతుందన్నారు. తెలిపారు. ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

కండ్లకుంటలో పశు వైద్య శిబిరం



పశు వైద్య శిబిరం ప్రారంభిస్తున్న పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ రామారావు

నకరికల్లు: జాతీయ సేవా పథకంలో భాగంగా నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ రామారావు సూచించారు. ఇందులో భాగంగా మండలంలోని కండ్లకుంట గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, అకడమిక్‌లో భాగంగా బీఎస్సీ అగ్రికల్చర్ చివరి సంవత్సరం విద్యార్థులు శిబిరంలో పాల్గొన్నారు. పాడి గేదెలు, దూడలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది మాట్లాడుతూ గర్భనిర్ధారణ పరీక్షలు, రెండు గేదెలకు మోకాలి శస్త్ర చికిత్సలు, 30 గేదెలకు డీవార్మింగ్, 1200 గొర్రెలకు వైద్య పరీక్షలు, 80 గొర్రెలకు ఎఫ్‌ఎండీ వ్యాక్సిన్, అలాగే సాధారణ పరీక్షలు చేసినట్లు తెలిపారు. మినరల్ మిక్చర్, లివర్ టానిక్, పాల ఉత్పత్తి ఔషధాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ ఆవుల సాయి మహేష్‌రెడ్డి, డాక్టర్ వంశీప్రసాద్, పశు వైద్యులు డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ హిమని, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ కె.చంద్రశేఖర్‌రెడ్డి, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ డి.దాసు, ఏఐ వర్కర్ వెంకటేష్, గోపాల మిత్ర సురేంద్ర, ఓఎస్‌లు ఆంజనేయులు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి లక్ష్మీనారసింహుని కల్యాణోత్సవాలు



బెల్లంకొండ: మండలంలోని కేతవరం శ్రీవజ్ర లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాలను రేపటి నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఈవో అవుదూరి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామాల పరిధిలో ఆలయం ఉండటంతో స్వామి వారిని సమీపంలో కొండపైన ఉంచి, నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ప్రధాన అర్చకులు దీవి చెన్నకేశవాచార్యులు, ప్రసన్న కుమారాచార్యులు మాట్లాడుతూ 10న ఉదయం ఆరు గంటలకు స్వామివారిని పెండ్లి కుమారుడిని చేయుట, సాయంత్రం 7 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, అఖండ స్థాపన, మహిపూజ, ధ్వజారోహణ, తీర్థ ప్రసాదాల వియోగం, 11న ఉదయం 8 గంటలకు నిత్య ఉపాసన, బలిహరణ, మధ్యాహ్నం ఉచిత అన్నదానం నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు స్వామి వారిని, అమ్మవారిని కల్యాణ మండపంకు తోడ్కొని పోవుట, ఎదురుకోలు మహోత్సవం, రాత్రి 12 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 12న ఉదయం 8 గంటలకు నిత్య ఉపాసన, బలిహరణ, గ్రామోత్సవం, అనంతరం అన్నదానం చేయనున్నారు. సాయంత్రం 4 గంటలకు స్వామి వారి దివ్య రథోత్సవం, అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈవో తెలిపారు.

వార్షిక రుణ ప్రణాళికతో ఆర్థిక స్వావలంబన

జిల్లా వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి



పెదకూరపాడు : వార్షిక రుణ ప్రణాళికతో ప్రతి మహిళా ఆర్థిక స్వావలంబన సాధన దిశగా అడుగులు వేస్తారని వెలుగు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి అన్నారు. మండలంలోని బలుసుపాడు గ్రామంలో మంగళవారం ఇందిరా గ్రామ సమాఖ్యలో జరుగుతున్న వార్షిక రుణ ప్రణాళికపై ఎన్యూమరేటర్ల సర్వేను ఆమె పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఎన్యూమరేటర్లతో మాట్లాడారు. సరైన లక్ష్యాలను ఎంపిక చేసుకొని వాటి సాధన దిశగా ప్రతి మహిళ అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీఎం హనుమా నాయక్, ఏపీఎం సునీత, సీసీలు బుల్లి బాబు, శ్రీనివాసరావు, ఇందిరా గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి మాధురి, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.